సాక్షి సూర్యాపేట

మంగళవారం ၊ 5 ၊ నవంబర్ ၊ 2024



గుప్తనిధుల కోసం..

ఆకారంలోని సూర్య దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 587.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 46,506 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 46,506 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,191 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,767 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,948 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,200
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 643.60 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 738.37 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 738.37 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్



కార్తీక పూజలు కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా సూర్యాపేటలోని రామలింగేశ్వర దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సూర్యాపేటలోని పాత శివాలయంలో శివుడికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు



అగ్రరాజ్యంలో ఎన్నికలపై మనోళ్ల ఉత్కంఠ

- నేడు అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్
- రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్‌ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ మధ్య హోరాహోరీ
- విజయం ఎవరిని వరిస్తుందోనని చర్చ

అక్కడ ఓటుహక్కు కలిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసుల మనోగతం

- 8లో

న్యూస్‌రీల్

తిరుమలగిరి మార్కెట్‌కు 24,746 బస్తాల ధాన్యం



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ఈ సీజన్‌లోనే అత్యధికంగా సోమవారం 24,746 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ వెల్లడించారు. క్వింటాకు గరిష్టంగా రూ.2061, కనిష్టంగా రూ.1880 ధర పలికినట్లు తెలిపారు.

రుణాలు త్వరగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

సూర్యాపేట : రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలను త్వరగా పంపిణీ చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీసీసీబీ డివిజన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్లు ఎ. శ్రవణ్ కుమార్, గుడిపాటి సైదులు, కొండ సైదయ్య, బ్యాంకు సీఈఓ శంకర్‌రావు, జీఆర్ఓఎస్సీ మైఖేల్ బోస్, సూర్యాపేట జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు, డీజీఎం ఉపేందర్ రావు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌తోనే రైల్వే కార్మికులకు మేలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ రవీందర్

మఠంపల్లి: మజ్దూర్ యూనియన్‌తోనే రైల్వే కార్మికులకు మేలు జరుగుతుందని దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ రవీందర్ అన్నారు. సోమవారం ఆయన మజ్దూర్ యూనియన్ మధిర బ్రాంచ్ ఆధ్వర్యంలో మఠంపల్లి సెక్షన్‌లో సికింద్రాబాద్ డివిజన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కీమెన్ బీట్ లెంత్ తగ్గించాలని ఉద్యోగులు కోరడంతో వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వారం రోజుల్లో ఆదేశాలు ఇప్పిస్తామని హామీ ఇప్పించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సంపత్‌రావు, యుగంధర్, అంజయ్య, చైర్మన్ వెంకట్, సీసీయాస్ డెలిగేట్స్ కిరణ్, కిషోర్, శ్రీనివాస్, వినయ్, కృష్ణ, చారి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేపట్టారు. సోమవారం రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున స్వయంభూలను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు... ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఆలయ ముఖమండపం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు.

29,608 మంది రైతులకు

రుణమాఫీ కాలే..!

- కుటుంబ నిర్ధారణ చేయడంలో జాప్యం
- ఇప్పటి వరకు 80 శాతం మంది వివరాలు యాప్‌లో నమోదు
- పదిరోజులుగా యాప్ ఓపెన్‌కాక నిలిచిన ప్రక్రియ
- రైతులకు తప్పని ఎదురుచూపులు



ఈ ఫొటోలో కన్పిస్తున్న రైతు పేరు కనుకు సత్యనారాయణ. సొంతూరు జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం. 2019 లో సూర్యాపేటలోని కెనరా బ్యాంకు నుంచి రూ.1.40లక్షల పంట రుణం తీసుకున్నాడు. దీనికి రూ.6వేల వడ్డీ కలుపుకొని ప్రస్తుతం రూ.1.46లక్షల అప్పు అయ్యింది. ప్రభుత్వ నిబంధనల మేరకు మాఫీ కావాల్సి ఉన్నా కాలేదు. అధికారులను సంప్రదిస్తే ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్‌లో ఒకేలా పేరు లేదని చెప్పారు. అసలు మాఫీ అవుతుందా..? కాదా..? అంతుపట్టడం లేదు.



భానుపురి (సూర్యాపేట) : రైతు రుణమాఫీ పథకం అసంపూర్తిగానే మిగిలింది. మూడు విడతల్లో చేపట్టిన ఈ ప్రక్రియలో అన్ని అర్హతలున్నా వివిధ సమస్యల కారణంగా వేలమందికి మాఫీ డబ్బులు జమ కాలేదు. ఇలాంటి వారందరి కుటుంబ నిర్ధారణ చేయాలని ప్రభుత్వం ఆదేశించగా.. జిల్లాలో ఈ ప్రక్రియ 80 శాతమే పూర్తయింది. 10 రోజులుగా సంబంధిత యాప్ పనిచేయకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. దీంతో 29,608 మంది రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

80శాతమే నమోదు పూర్తి

కుటుంబ నిర్ధారణ కోసం వచ్చిన దరఖాస్తుల్లో వ్యవసాయ అధికారులు 80 శాతం వివరాలను మాత్రమే ఈ యాప్‌లో నమోదు చేశారు. దాదాపు 10 నుంచి 15 రోజులుగా యాప్ పనిచేయకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. ఇక బ్యాంకర్లకు ఆధార్ కార్డుల్లో ఒకలా, పట్టాదారు పాసు పుస్తకాల్లో మరోలా ఉన్నవారి వివరాల సేకరణకు గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేయగా.. ఒక్క దరఖాస్తు రాకపోవడం, పరిష్కారం కాకపోవడం కొసమెరుపు. ఇదిలా ఉండగా రూ.2లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుందా.. లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి వివరాలను సేకరించకపోవడం, ఎలాంటి కదలిక లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నాలుగో విడత కింద రూ.2లక్షల లోపు అర్హత ఉండి కానివారి రుణాలను, రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలను మాఫీ చేయాలని కోరుకుంటున్నారు.

కుటుంబ నిర్ధారణకు యాప్

జిల్లాలో మూడు విడతల్లో మొత్తం 95,350 మందికి గాను రూ.746.09 కోట్ల మాఫీ చేసింది. అయితే అన్ని అర్హతలు ఉండి పాస్ పుస్తకం, బ్యాంక్ పుస్తకాలు, ఆధార్ కార్డులో తప్పులు, రేషన్ కార్డు లేకపోవడం తదితర కారణాలతో సుమారు 29,608 మందికి రుణమాఫీ కాలేదని ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ రుణమాఫీ చేసేందుకు గాను కుటుంబ నిర్ధారణ చేయాలని భావించి యాప్‌ను రూపొందించింది.

మూడు విడతల్లో మాఫీ ఇలా..

విడత	రైతుల సంఖ్య	మాఫీ అయిన డబ్బు (రూ.కోట్లలో)
మొదటి	56,217	282.78
రెండో	26,376	250.07
మూడో	12,757	213.24

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

- అదనపు కలెక్టర్ రాంబాబు

భానుపురి (సూర్యాపేట) : ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ఇప్పటి వరకు వివిధశాఖల్లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. వచ్చే వారం నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తుల స్థితిగతులను వివరించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండలాల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం తరలించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలపై 16 దరఖాస్తులు, డీడబ్ల్యూఓ 4, డీఆర్‌డీఓ 6, డీపీఓ 1, డీఏఓ 7, ఇతర శాఖలకు సంబంధించి 24 ఇలా మొత్తం 58 దరఖాస్తులు అందాయని వీటిని సంబంధిత శాఖలకు పంపినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ అప్పారావు, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీడబ్ల్యూఓ నరసింహారావు, సంక్షేమ అధికారులు శంకర్, లత, బీసీ వెల్ఫేర్ అధికారి అనసూర్య, డీసీఓ పద్మజ, డీపీఓ నారాయణ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపునకు అదనపు కోర్సులు

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ రూరల్ : విద్య ప్రమాణాలు నైపుణ్యాల పెంపు కోసం అదనపు కోర్సులు నిర్వహించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం యూనివర్సిటీలో అన్ని శాఖల అధిపతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. నైపుణ్యాలు పెంచేందుకు ప్రతి విభాగం నుంచి అదనపు కోర్సులు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు అదనంగా నైపుణ్య శిక్షణలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది క్వార్టర్స్‌లో నివసించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, అధ్యాపకులు రవి, రమేష్, ఉపేందర్ రెడ్డి, శ్రీదేవి, అరుణ ప్రియ, సుధారాణి, మాధురి, రూప, తిరుమల, రామచంద్రగౌడ్, రమేష్, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

సేవ చేయడంలో పోలీస్ శాఖ ముందంజ



డీఎస్పీ కార్యాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మందుల సామేలు, ఐజీ సత్యనారాయణ, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

- ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలి
- పేటలో డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఉత్తమ్



డీఎస్పీకి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే సామేలు

సూర్యాపేటటౌన్ : ప్రజలకు సేవ చేయడంలో పోలీస్ శాఖ ముందంజలో ఉంటుందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన డీఎస్పీ కార్యాలయాన్ని ఐజీలు రమేష్ , సత్యనారాయణ, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రూ.70 లక్షలు పోలీస్ హౌజింగ్ శాఖ నుంచి, రూ.20 లక్షలు పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఈ కార్యాలయానికి నిధులు సమకూర్చినట్లు తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడే విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలని సూచించారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ ప్రథమ స్థానంలో ఉందని, రాష్ట్రంలో పోలీస్ శాఖకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానన్నారు. సూర్యాపేట జిల్లాలో కొత్తగా ఏర్పడిన అనంతగిరి, చింతలపాలెం, పాలకవీడు, మద్దిరాల, నాగారం పోలీస్ స్టేషన్లకు నూతన భవనాలకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. నూతన కార్యాలయంలో డీఎస్పీ రవిని కుర్చీలో కూర్చొబెట్టి పుష్పగుచ్ఛం అందజేసి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లు నాగేశ్వరరావు, జనార్దన్ రెడ్డి, డీఎస్పీలు రవి, శ్రీధర్ రెడ్డి, సూర్యాపేట పబ్లిక్ క్లబ్ చైర్మన్ వేణారెడ్డి, జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకుడు చలసాని శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం సహించను



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

కోదాడ: కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడానికి నిరంతం కృషి చేస్తున్నామని, అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు సంబంధించి నీటిపారుదల, వ్యవసాయం, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, విద్య, వైద్యారోగ్యశాఖల పనితీరుతో పాటు వాటిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సోమవారం కోదాడలోని కాశీనాథం ఫంక్షన్‌హాల్‌లో అధికారులతో మంత్రి సమీక్షించారు. నీటిపారుదలశాఖలో గడిచిన రెండు నెలలుగా ఎలాంటి పురోగతి కనిపించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జాన్‌పహాడ్ ఎత్తిపోతల, ఉత్తమ్ పద్మావతి ఎత్తిపోతల పథకాల పనులను ఆలస్యం చేసే వారిపై చర్యలు తీసుకుంటానని అన్నారు. అభివృద్ధి పథకాలకు ఎన్ని నిధులు కావాలన్నా మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీఓలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఏర్నేనిబాబు పాల్గొన్నారు.

మట్టపల్లిలో గరుడ వాహన సేవ

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవారిని అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణతంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాల తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవారిని గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కాగా క్షేత్రంలోని శివాలయంలోగల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, మూర్తి దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామాచార్యులు, చీకూరి రాజేష్‌భక్తులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో గరుడవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

పదికి ప్రత్యేక తరగతులు

- ఐదు రోజులుగా కొనసాగుతున్న టెన్త్ స్పెషల్ క్లాసులు
- డిసెంబర్ వరకు సాయంత్రం వేళ
- జనవరి నుంచి రెండు పూటలా..
- వందశాతం ఫలితాల సాధనే లక్ష్యం



నాగారం జెడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

నాగారం: పదో తరగతిలో వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈనెల 1 నుంచే జెడ్పీ ఉన్నత, మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ఎయిడెడ్ స్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వచ్చే నెలాఖరు వరకు సాయంత్రం వేళ, 2025 జనవరి 1 నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు పూటలా ప్రత్యేక తరగతులు ఉంటాయి.

తరగతుల నిర్వహణ ఇలా..

జిల్లాలో 2024–25 విద్యాసంవత్సరంలో 6,345 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా టైంటేబుల్ రూపొందించుకోవడం, రోజూ ఒక సబ్జెక్టు ఉపాధ్యాయుడు స్పెషల్ క్లాస్ తీసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు వెనకబడకుండా ముఖ్యమైన అంశాలను చదివిస్తున్నారు. ఈనెల 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు సాయంత్రం 4:20 గంటల నుంచి 5:20 గంటల వరకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలి. జనవరి 1 నుంచి వార్షిక పరీక్షల వరకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4:20 నుంచి 5:20 గంటల వరకు రెండు పూటలా తరగతులు నిర్వహించాలి. ఇందులో రెగ్యులర్ తరగతులు బోధించకుండా పునశ్చరణ, మూల్యాంకనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. స్పెషల్ క్లాసులకు విద్యారులు విధిగా హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. ప్రత్యేకంగా రిజిస్టర్ మెయింటేయిన్ చేయాలి. ఎప్పటి కప్పుడు విద్యా ప్రగతిపై విద్యార్థులతో చర్చించాలి. ప్రధానోపాధ్యాయుడు నిరంతరం పర్యవేక్షిస్తూ చదువులో వెనుకబడిన వారిపై దృష్టి సారించాల్సి ఉంటుంది. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా పరీక్షలు నిర్వహించాలి. విద్యార్థులు రాసిన జవాబులను పరిశీలించి చర్చలతో సరిదిద్దాలి. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా మోటివేట్ చేయాలి.

గతేడాది ఉత్తీర్ణత ఇలా..

2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో 96 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా 6వ స్థానంలో నిలిచింది. ఈసారి వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి



పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత దాదాపుగా తీరింది. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీత సాధించే లక్ష్యంతో సబ్జెక్టు టీచర్లు ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగాలి. ప్రత్యేక తరగతుల కోసం విధిగా రిజిస్టర్ నిర్వహించాలి. అవసరమైతే అధికారులతో తగిన సలహాలు, సూచనలు తీసుకోవాలి.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

క్లుప్తంగా

డెడికేటెడ్ కమిటీ మెంబర్ సెక్రటరీగా చౌటుప్పల్ వాసి



బడుగు సైదులు

చౌటుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బీసీ కుల గణనకు సంబంధించి హైకోర్టు సూచన మేరకు ప్రత్యేకంగా డెడికేషన్ కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావును నియమించగా.. మెంబర్ సెక్రెటరీగా ఐఎఫ్ఎస్ అధికారి బడుగు సైదులు నియమితులయ్యారు. సైదులు స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్. ఉమ్మడి రాష్ట్రంలో ఐఎఫ్ఎస్ అధికారిగా వివిధ జిల్లాల్లో సేవలందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్ర సంక్షేమ గురుకులాల కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. బీసీ కులగణన నివేదిక సమర్పించే కమిటీలో చౌటుప్పల్‌కు చెందిన వ్యక్తి నియమితులవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

త్రిపురారం : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం త్రిపురారం మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్లకంటి గూడేనికి చెందిన కుంచం సైదులు(45) తన పొలంలో విద్యుత్ మోటార్ బంద్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. సైదులు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరు దుర్మరణం

యాదగిరిగుట్ట రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట పట్టణంలోని టెంపుల్ సిటీ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గజ్జి నర్సింహ (43) యాదాద్రి టెంపుల్ సిటీ పరిధిలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో టీఎస్25ఏ7137 గల ట్రాక్టర్‌ను తీసుకుని టెంపుల్ సిటీ పరిధిలో చెట్లకు నీళ్లు పోయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నడుపుతున్న నీళ్ల ట్యాంకర్‌ను డివైడర్‌కు గుద్దడంతో ట్రాక్టర్ ఒక పక్కకు బోల్తా పడింది. దీంతో డ్రైవర్ నర్సింహ కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యమంలో మృతి చెందాడు. ట్రాక్టర్ బోల్తా పడినప్పుడు మృతుడికి ఫిట్స్ వచ్చాయని స్థానికులు చెబుతున్నారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

అగ్రరాజ్యంలో ఎన్నికలపై మనోళ్ల ఉత్కంఠ

- కొందరు ట్రంప్‌కు, మరికొందరు కమలాహారిస్‌కు మద్దతు
- గెలుపు అవకాశాలు ఇద్దరికీ ఉన్నాయని విశ్లేషణ
- అమెరికాలో ఓటుహక్కు కలిగి ఉన్న.. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురి మనోగతం



ప్రపంచంలో అగ్రరాజ్యమైన అమెరికాకు మనదేశం నుంచి ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం వేలాది మంది వెళ్తుంటారు. ఇప్పటికే చాలామంది అక్కడి వెళ్ల స్థిరపడ్డారు. ఆ దేశంలో ఈనెల 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలాహారిస్ బరిలో నిలిచారు. వీరిలో ఎవరు గెలుస్తారోనని యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అమెరికాలో ఓటుహక్కు వినియోగించుకోనున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురి అభిప్రాయాలు వారి మాటల్లో..

కమలా హారిస్‌కే విజయావకాశాలు ఎక్కువ



కోదాడ: మాది కోదాడ. మేము ఉద్యోగ రీత్యా అమెరికాలోని నార్త్ కరోలినాలో ఉంటున్నాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్‌కే ఎక్కువ విజయావకాలున్నాయి. ఇతర దేశాల నుంచి ఇక్కడ స్థిరపడిన వారిలో 80 శాతం మంది కమలకే మద్దతుగా నిలుస్తున్నారు. భారతీయులు దాదాపు కమలాహారిస్ విజయం సాధించాలని కోరుకుంటున్నారు. ఇక్కడ వారి అంచనాల ప్రకారం 2శాతం మెజార్టీతో కమల గెలుపొంది అమెరికా అధ్యక్షురాలు అవుతుంది.

- కందిబండ ప్రియాంక, నార్త్ కరోలినా

ట్రంప్ గెలవకూడదని కోరుకుంటున్నారు



కోదాడ: మా స్వస్థలం కోదాడ పట్టణం. అమెరికాలోని నార్త్ కరోలినాలో స్థిరపడ్డాం. ప్రస్తుత పరిస్థితుల్లో డోనాల్డ్ ట్రంప్ గెలిస్తే ఇతర దేశాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారికి ఇబ్బందులు తప్పవనే ప్రచారం జరుగుతుంది. అమెరికన్‌లకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పడంతో ట్రంప్‌కు మద్దతిచ్చేవారు తగ్గిపోయారు. ట్రంప్ గెలవకూడదని ఎక్కువ శాతం ప్రజలు కోరుతున్నారు. నార్త్ కరోలినాలో భారతీయులు ఎక్కువగా ఉంటారు. ఇక్కడ కమలా హారిస్‌కే మద్దతు ఎక్కువగా ఉంది.

- శిరాబు కృష్ణకాంత్, నార్త్ కరోలినా

ట్రంప్ గెలిచే అవకాశం ఉంది



భువనగిరి: మాది భువనగిరి పట్టణం. అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థిరపడ్డాం. ఈ నెల 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ డెమోక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్షుడిగా బరిలో ఉన్న అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశం ఉంది. గతంలో దేశానికి అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం కూడా ఉన్న ట్రంప్ మంచి ఆర్థిక సంస్కరణలు తీసుకురాగలరు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉంటే అమెరికా–ఇండియా మధ్య సత్సంబంధా లు మెరుగు పడతాయి. రిపబ్లిక్ పార్టీకి చెందిన అభ్యర్థి కమలాహ్యారీస్ భారత సంతితికి చెందిన వారు అయినప్పటికీ ఇండియాకు చెందిన వారు ఆమెకు మద్దతు తెలపడం లేదు.

- జి.సంతోష్, కాలిఫోర్నియా

ప్రస్తుత పరిస్థితుల్లో ట్రంప్ గెలవాలి



భువనగిరి: మాది వలిగొండ మండలం టేకులసోమారం గ్రామం. అమెరికాలోని నార్త్ కరోలినాలో 23 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాం. అమెరికా అధ్యక్ష ఎన్నికలు రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నెలకొంది. ఆరు నుంచి 7 వరకు స్వింగ్ స్టేట్స్ వీరి గెలుపును నిర్ధారిస్తాయి. ఎవరు గెలిచిన స్వల్ప మెజార్టీతో గెలుస్తారు. ఇండియన్స్ ఎక్కువ శాతం ట్రంప్ వైపు మొగ్గ చూపుతున్నారు. నేడు మాత్రం ట్రంప్‌కే ఓటు వేయాలని నిర్ణయించుకున్నాను.

- పడమటి శ్యాంసుందర్‌రెడ్డి, నార్త్ కరోలినా

భారతదేశ అభివృద్ధికి సహకరించే వారికే ఓటేయాలి



అర్వపల్లి: మాది సూర్యాపేట జిల్లా మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామం. అమెరికాలోని అట్లాంటా ఉంటున్నాం. ఇప్పటికే రెండు సార్లు అమెరికా ఎన్నికల్లో ఓటు వేశాను. భారతదేశ అభివృద్ధికి సహకరించే వారికి అమెరికా ఎన్నికల్లో భారతీయులు ఓటేయాలి. సాఫ్ట్‌వేర్ పరిశ్రమకు, భారత విదేశాంగ విధానం, ఎగుమతి, దిగుమతికి మద్దతు తెలిపే వాళ్లకే మా ఓటు. కులాలను చూసి ఓటు వేయవద్దు.

- జూలకంటి లక్ష్మారెడ్డి, అట్లాంటా

భారతీయులు ట్రంప్ వైపే..



అర్వపల్లి: మాది సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండల కేంద్రం. అమెరికాలోని హూస్టన్‌లో స్థిరపడ్డాం. 30 ఏళ్ల పైనుంచి అక్కడే ఉంటున్నాం. ఇప్పటికే 20 సార్లు అక్కడ ఓటు హక్కు వినియోగించుకున్నాను. అమెరికాలో ఎక్కువ మంది భారతీయులు ట్రంప్‌వైపే ఉన్నారు. నాది రిపబ్లికన్ పార్టీ. నేను ఎన్నికల్లో ట్రంప్‌కే ఓటేస్తాను.

- ఆలూరి బంగార్‌రెడ్డి, హూస్టన్

డెమోక్రటిక్ పార్టీ వైపే మొగ్గు



కోదాడ: మాది కోదాడ పట్టణం. అమెరికాలోని చికాగో నగరంలో స్థిరపడ్డాం. అధ్యక్ష్య ఎన్నికల్లో ఈ సారి ఇండియన్స్ డెమోక్రాట్స్ అభ్యర్థి కమలాహారిస్ వైపే మొగ్గు చూపుతున్నారు. స్వల్ప మెజార్టీతోనైనా కమల గెలుస్తుందనే చర్చ జరుగుతుంది. వలస చట్టాలపై ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉందని ఇతర దేశాల నుంచి అమెరికా వచ్చిన వారు భయపడుతున్నారు. ట్రంప్ కూడా తన ప్రసంగాలలో ఇతర దేశాల నుంచి వచ్చి అమెరికన్‌ల అవకాశాలను దెబ్బతీస్తున్నారని ప్రచారం చేస్తున్నారు.

- బొగ్గారపు మణిదీప్, గుడుగుంట్ల నాగలక్ష్మి, చికాగో

డోనాల్డ్ ట్రంపే గెలుస్తారు



సూర్యాపేట: మాది సూర్యాపేట పట్టణం. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ సిన్సినాటి, ఒహాయో రాష్ట్రంలో ఉంటున్నాం. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌కే విజయావకాశాలు ఉన్నాయి. నేను కూడా అదే పార్టీకి ఓటేయాలనుకుంటున్నా. ఈ సారి ట్రంప్ గెలిస్తే ఉక్రెయిన్, ఇజ్రాయిల్ యుద్ధాలు ఆగిపోతాయని భావిస్తున్నాం. ట్రంప్ గెలిస్తే వ్యాపార వర్గాలకు పన్నుల్లో రాయితీ ఇస్తారని, దీంతో ద్రవ్యోల్బణం నియంత్రణ అవుతుంది.

- విజయశంకర్ కోణం, సిన్సినాటి, ఒహాయో

ట్రంప్ గెలిస్తేనే భారతీయులకు భద్రత



తిరుమలగిరి(నాగార్జునసాగర్): మాది నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం కొంపల్లి గ్రామం. నేను, నా భర్త బొలిగోర్ల శ్రీనివాస్, అలియాస్ కొంపల్లి శ్రీనివాస్ 2010లోనే అమెరికాలోని కొలంబస్‌కు వచ్చాం. అప్పటి నుంచి కొలంబస్‌లో ఉంటున్నాం. భారతీయుల భద్రత విషయంలో ట్రంప్ స్పష్టమైన హామీ ఇచ్చారు. ట్రంప్ గెలుస్తేనే భారతదేశానికి గానీ, అమెరికాలో ఉంటున్న భారతీయులకు గానీ లాభం చేకూరుతుంది. కమలాహారిస్‌భారత సంతతికి చెందినప్పటికీ ఎక్కువ మంది భారతీయులు ట్రంప్ వైపే మొగ్గు చూపుతున్నారు.

- దివ్య, కొలంబస్

ట్రంప్ గెలవాలనుకుంటున్నారు



నల్లగొండ: మాది నల్లగొండ. అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో స్థిరపడ్డాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కే విజయావకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయంగా కమలా హ్యారిస్‌కు అంతగా అనుభవం లేదని ప్రజల్లో ప్రచారం సాగుతోంది. గతంలో అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చూస్తే ట్రంప్ వైపే అమెరికన్ ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ట్రంప్, కమలాహారిస్ మధ్య హోరాహోరీగా పోటీ ఉన్నా అమెరికా ప్రజలు ట్రంప్ గెలవాలనుకుంటున్నారు.

- కంచరకుంట్ల వెంకటరాంరెడ్డి, లాస్ ఏంజెల్స్

బలమైన నాయకత్వం అవసరం



ఆత్మకూర్ (ఎస్): మాది ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామం. అమెరికాలోని నార్త్ కేరోలినాలో కెమికల్ ఎనామిస్ట్‌గా స్థిరపడ్డాను. అమెరికా దేశం ముందు ఎన్నడూ చూడని సవాళ్లు ఎదుర్కొంటోంది. ధరలు పెరగడం, పెరుగుతున్న నేరాలు, సరిహద్దు భద్రత సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి బలమైన నాయకత్వం అవసరం. వైఫల్యంతో నిండిన బైడెన్ ఆర్థిక, వలస, విదేశీ విధానాల నుంచి పునరుద్ధరించడానికి ట్రంప్ గెలుపు చాలా అవసరం.

- దండ నీరజ, కెమికల్ ఎనామిస్ట్, నార్త్ కరోలినా

ట్రంప్ గెలిస్తేనే బాగుంటుంది



ఆత్మకూర్(ఎం) : మాది ఆత్మకూర్(ఎం) మండలం సిద్ధాపురం. మేము 27 సంవత్సరాల నుంచి అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నివాసం ఉంటున్నాం. మంగళవారం అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ఉంది. అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ నుంచి ట్రంప్, డెమోక్రటికన్ పార్టీ నుంచి కమల హారిష్ పోటీ పడుతున్నారు. హోరాహోరీ పోటీలో ఎవరు గెలుస్తారో తెలియని పరిస్థితి ఉంది. ట్రంప్ ముక్కుసూటి మనిషి అయినా ఆయన గెలిస్తేనే భద్రత అనే ఉంటుందని నా అభిప్రాయం. కమలా హారిస్ అమెరికా ఉపాధ్యక్షులుగా ఉన్నా పాలన పరంగా పెద్దగా అనుభవం లేదు. ఆమె విధి విధానాలు ట్రంప్‌కు లాభం కలిగేలా ఉన్నాయి.

- ఏనుగు లక్ష్మణ్‌రెడ్డి, న్యూయార్క్

హోరాహోరీగా ఎన్నికల ప్రచారం



అర్వపల్లి: మాస్వగ్రామం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం. అమెరికాలోని టెన్నెసి రాష్ట్రంలో ఉంటున్నాం. అక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. ఈసారి అక్కడి ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వేయబోతున్నాను. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ప్రచారం హోరాహోరీగా జరుగుతోంది. కమలాహారిస్, ట్రంప్ మధ్య పోటీ నువ్వా...నేనా అన్నట్లుగా ఉంది. భారతదేశ అభివృద్ధికి కృషిచేసే వారికే ఓటేయాలి. మొదటి సారి ఓటుహక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది.

- జన్నపు శ్రీదేవి, టెన్నెసి

ట్రంప్‌తోనే ఉద్యోగావకాశాలు



నేరేడుచర్ల: మాది సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల. నేడు అమెరికాలో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోబోతున్నాను. ఈ ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి ట్రంప్ గెలిచే అవకాశాలు ఉన్నాయి. ట్రంప్ గెలిస్తే భారతీయులకు ఉద్యోగ అవకాశాలు సురక్షితంగా ఉంటాయి. మేము ఉన్న ప్రాంతంలో మాతో పాటుగా చాలా మంది ట్రంప్‌కు ఓటు వేసే అవకాశాలున్నాయి.

- దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, బేబికాన్

నా మద్దతు కమలాహారిస్‌కే..



శాలిగౌరారం: మాది శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామం. అమెరికాలోని మిజోరి స్టేట్‌లో స్థిరపడ్డాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో తమ కుటుంబంలో ముగ్గురం ఓటు హక్కును వినియోగించుకోనున్నాం. నేను ఓటు వేయడం ఇది మూడవసారి. నా మద్దతు కమలాహారిస్‌కే.

- పాదూరి రామమోహన్‌రెడ్డి, మిజోరి స్టేట్

పార్కింగ్ చేసిన బైకులే టార్గెట్

- ఎనిమిది మంది అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్టు
- 27 బైకులు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట టౌన్: పార్కింగ్ చేసిన బైకులే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడుతున్న ఎనిమిది మంది అంతర్‌రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కోదాడ పట్టణంలో హుజూర్‌నగర్ ఫ్లై ఓవర్ దగ్గర స్థానిక సీఐ రాము అతని సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు వాహనాలపై వస్తున్న ఐదుగురిని అనుమానాస్పదంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరు హుజూర్‌నగర్‌కు చెందిన బారి నాగరాజు అలియాస్ గుంటూరు నాగరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన గుంజి రామాంజనేయులు, షేక్ కాసినపల్లి బాష, గుంజి కృష్ణ, తమ్మిశెట్టి వెంకటేష్, గోపాలకృష్ణలుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా పార్కింగ్ చేసి ఉన్న ఖరీదైన బైకులను అపహరిస్తున్నట్లు ఒప్పుకున్నారు. గతంలో కోదాడ పట్టణంలో రాయల్ ఎన్‌ఫీల్డ్, ఒక యూనికాన్, ఒక పల్సర్ బైకును దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. అలాగే సూర్యాపేట టౌన్, కోదాడ టౌన్, హుజూర్‌నగర్, మఠంపల్లి, కాచిగూడ, చైతన్యపురి, ఎల్బీ నగర్, దామరచర్ల, నరసరావుపేట, రెంటచింతల, మాచర్ల, రాజుపాలెం, నకిరేకల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో బైకు దొంగతనాలు చేసినట్లు అంగీకరించారు. అలాగే మునగాల ఎస్ఐ ప్రవీణ్ సిబ్బందితో ముకుందాపురం వద్ద ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు కోదాడ నుంచి సూర్యాపేటకు వెళుతుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఏపీకి చెందిన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలానికి చెందిన మొచ్చిర్ల శ్రీను, అలుగు తరుణ్, చిన్ను బైకు దొంగతనాలకు పాల్పడుతున్న ఒప్పుకున్నారు. వీరంతా జల్సాలకు అలవాటు పడి డబ్బులు సంపాదించడం కోసం పార్కింగ్ చేసిన బైకులను టార్గెట్ చేసి దొంగతనం చేసినట్లు ఎస్పీ తెలిపారు. అయితే వీరిలో గోపాలకృష్ణ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. మిగతా ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి రూ.25.10లక్షల విలువల గల 27బైకులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐ శివ కుమార్, కోదాడ సీఐ రాము, మునగాల సీఐ రామకృష్ణ రెడ్డి, ఎస్బీ సీఐ వీరరాఘవులు, ఎస్ఐలు ఉన్నారు.



పట్టుబడిన నిందితులు, బైకులతో పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ ఉత్తమ డ్యూప్లెక్స్ లగ్జరీ విల్లాలు. నివసించుటకు సిద్ధంగా ఉంది! మిర్యాలగూడలో 2, 3 & 4BHK విల్లాలు, D-మార్ట్ పక్కన, ఆధునిక సౌకర్యాలను ఆస్వాదించండి. క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, మస్ట్ విజిట్. Ph: 7013578378 [HA-840]

Wanted

■ శ్రీలక్ష్మీ హోంకేర్ Hyd నందు వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు లేడీ టెలికాలర్స్, బేబి కేర్, ఇంటి/వంట పనికి (స్త్రీ/పు) కా॥ జీ: 17,000-25000 రూం+మీల్స్ ఫ్రీ 93471 48051 [G-2197]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ18k Ph: 9160900024, 9640400073 [SCA-24000547]

■ హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్‌లలో పని చేయుటకు అనుభవం కలిగిన సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం నెలకు 16000/8గం. వసతి,క్యాంటీన్ కలదు.10thపాస్,ఎత్తు 5.6, వయస్సు 35సం.లోపు.Cell: 9346666721, 9346172927, 8919606707 [HA-989 07]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

అర్వపల్లి: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి శివారులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బూర్గుల రాంబాబు, ఆయన భార్య రజిత ఆదివారం రాత్రి అర్వపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. రాంబాబు, రజిత తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో సూర్యాపేటలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేములపల్లి : ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా ఓ ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం రావులపెంటకు చెందిన జంగిలి శంకర్ తన ట్రాక్టర్ ద్వారా అనుమతులు లేకుండా సోమవారం ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నామన్నారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి యజమానితోపాటు ట్రాక్టర్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామంలో గల పురాతన సూర్య దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపగా సోమవారం ఆలస్యంగా వెలు గులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకారం–వల్లాల అనుసంధాన డొంకదారి సమీపంలో వ్యవసాయ పంటపొలాల నడు మ పూర్తిగా శిథిలావస్థకు చేరి ఉన్న సూర్య దేవాలయంలో గుర్తుతెలియని దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. పొరుగు రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి ఇక్కడ వ్యవసాయ భూములను కొనుగోలు చేసినప్పటి నుంచి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరపడంతో పంచలోహ విగ్రహాలు మాయమయ్యాయని స్థానికులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే మరోమారు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపి ఉండవచ్చని గ్రామస్తులు అంటున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదం

- డీఐఈఓ రమణి
- ఉమ్మడి నల్లగొండ జిల్లా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

భువనగిరి : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా ఇంటర్మీడియేట్ నోడల్ ఆఫీసర్ సి.రమణి అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 68వ ఎస్‌జీఎఫ్ అండర్–19 ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదపడుతాయని చెప్పారు. అనంతరం జెండా ఊపి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ పాపిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇందిర, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ బాలకృష్ణ, పీడీ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణి

విజేతలు వీరే..

అథ్లెటిక్స్ పోటీల్లోని 1500 మీటర్ల పరుగు పందెం బాలికల విభాగంలో కె.శివాని, జి.స్పందన, ఎస్.సంధ్య, ఎం సాగరిక, బాలుర విభాగంలో వి.చంద్రశేఖర్, జి.మధుకర్, ఎం.ప్రమోద్, డి.ప్రవీన్ గెలుపొందారు. 400 మీటర్ల పరుగు పోటీల్లో బాలికల విభాగంలో బి.దేవిశ్రీ, డి.సంజన, జి.ఆకాంక్ష, ఎం.మౌనిక, బాలుర విభాగంలో ఎస్.రాము, ఎన్.నవీన్, కె.శివ గెలుపొందారు. డిస్కస్ త్రోలోని బాలికల విభాగంలో కె.నందిని, ఎన్.ప్రణతి, ఉదయ్‌శ్రీ, బాలుర విభాగంలో ఎం.రాహుల్, వి.వినోద్ కుమార్, ఎస్.అక్షయ్, జావలిన్ త్రోలో బాలికల విభాగంలో హారిక, రాజేశ్వరీ, ప్రణతి గెలుపొందారు.



జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన పంగ శ్రీను(39) రోజు మాదిరిగానే ఉదయం 6 గంటలకు పొలం పనులకు వెళ్లాడు. మృతుడి భార్య కవిత తమ చేనులో పత్తి తీయడానికి కూలీలను వెంటబెట్టుకొని ఉదయం 9.30 గంటలకు వెళ్లింది. అప్పటికే పంగ శ్రీను అక్కడ పడి ఉండడాన్ని చూసిన భార్య అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మృతుడి ఎడమ నడుము పైభాగాన చర్మం చీలి ఉండడంతో మృతుడి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తల్లి పంగ సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.



పంగ శ్రీను(ఫైల్)